# మిసెస్ వి. కే. వటీరావు, యమ్మే

ఈమధ్య నాభార్య నాతో బహు అన్యోన్యంగా ఉండడం మొదలెట్టింది. సాధారణంగా తన చీర లేమిటో, తన బ్లౌసు లేమిటో, తన ఆభరణాలేమిటో, తన అలంకరణ మేమిటో, తన క్లబ్బేమిటో అదే గొడవగాని, భర్త అనే మగవాడిని నేనొక్కణ్ణి ఉన్నాననీ, నాకూ, తనకూ విచ్ఛిత్తిగాని ప్రేమ ఆజన్మమూ ఉండాలనీ మరిచి పోయేది. హోటలిల్నించి భోజనం తెప్పించుకొని మేమిద్దరమూ మూఁగ నోముపట్టి భోంచేశే వాళ్ళము. తక్షణమే ఆవిడ క్లబ్బుకు సింగారించుకు వెళ్ళిపోయేది. నేను కచేరీకి పరుగెత్తుకు పోయేవాణ్ణి.

పిల్లలు వేరే కాన్వెంటు స్కూలులో చదువు కొంటున్నారు కాబట్టి వాళ్ళగొడవ నాకూ మా ఆవిడకూ కూడా పట్టేదికాదు. ఎప్పుడైనా పిల్లలు యింటికి తిరిగి వస్తే నన్ను అసలే మరిచిపోయేది మాఆవిడ. వాళ్ళచేత యింగ్లీషు పద్యాలూ పాటలూ పాడించడం, వాళ్ళచేత యింగ్లీషు ఆటలు ఆడించడం, వాళ్ళతోపాటు తనూ గంతులెయ్యడం, స్కిప్ చెయ్యడం, డాన్సు చెయ్యడం, ఇదీ పొద్దస్తమానమూను. సాయంత్రం వాళ్ళను యింగ్లీషు దుస్తులతో అలంకరించి, తనూ అలంకరించుకొని క్లబ్బుకు తీసుకుపోయేది. నిజం చెప్పాలి కాబట్టి చెప్పుతున్నాను- నాభార్యమాత్రం యింగ్లీషు దుస్తులు ధరించేదిగాదు. హ్యాట్ పెట్టేదికాదు. రోజు కోరకం చీర

కట్టుకొని, బాహుమూల రుచుల కడ్డురాని రవిక తొడుక్కొని ఒక చేతికి రెండు బంగారు గాజులు పెట్టుకొని, రెండో చేతికి రిష్టువాచీ కట్టుకొని క్లబ్బుకు వెడుతూండేది.

ఒకమాటు అన్నానుగదా హాస్యానికి—"ప్రోసీ నువ్వు కల్చర్డులేడీవిగదా; యమ్మే ప్యాసయ్యేవు; లేడీస్ కల్చర్ క్లబ్బులో సభ్యురాలవు, బైసికిల్ తొక్కగలవు కూడాను— ఈచీరలూ, రవికలూ ఖర్మం ఏమిటే? స్కర్టు తొడుక్కొని హ్యాట్ పెట్టుకొని యింగ్లీషు స్త్రీలలాగ.......................... వాక్యం పూర్తిగాక ముందే నన్ను గట్టిగా ఛెళ్ళున చెంపమీద కొట్టి "మీరు సూటు వేసినపుడు నేను కడతానులెండి స్కర్టు" అంటూ నిప్పులు గ్రక్కుతూ లేచి పోయింది.

చెంపకాయ తిని ఊరుకొన్నాను. ఊరుకోక చేశేదేమిటి— యమ్మే ప్యాసైన కామిని సహధర్మచారిణి అయినప్పుడు? ఇంటిగుట్టు రట్టు చేసుకోవచ్చునా? ఇంతకీ హిందూస్త్రీ ధర్మానికి వ్యతిరేకంగా స్కర్టు హ్యాట్టుల ధరించుకోమని చెప్పడం నాదే తప్పు!

సాధారణంగా ఈవిధంగా ఉండే నాభార్య నామొదల ఎక్కువ అన్యోన్యంగా ఉండడమూ, నాతో ఎక్కువ కాలం గడపడమూ, నాతో అదేమాటలు చెప్పడమూ, అదే పరిహాసాలు చెయ్యడమూ, అదే కథలు చెప్పడమూ, నన్ను

దువ్వడమూ లాలించడమూ—యిదంతా తమాషాగా తోచింది. ఏమిటి చెప్మా కారణం అనుకొన్నాను. ఏమీ స్ఫురించింది కాదు.

కాని ఒక సంగతి జ్ఞాపకం వచ్చింది. నిరుడు కొంచెం హెచ్చుతగ్గుగా యీ విధంగానే నాతో అన్యోన్యంగా ఉండేది. నా పూర్వాచార పరాయణత్వాన్ని మెచ్చుకొనేది. చివరకు నా చేత వేషం వేయించి, నన్ను నలుగురు ఆడవాళ్ళలోనూ రవ్వపాలు చేసి, భర్తను ఫూల్ని చెయ్యడంలో అగ్రగణ్య అనే పేరు సంపాదించి, అందుకుగాను క్లబ్ యిచ్చే బహుమానాన్ని సంపాదించింది. నిజానికి కొంతతప్పు నాదికూడాను. వేషం వెయ్యడానికి పూనుకొన్నది నేనే. నాభార్య నన్ను పురిగొల్పి నాకు సహాయం చేసింది—దుర్బుద్ధితో నైతేనేమి? అంతేకాకుండా తనతోపాటు నాకూ బహుమతులు తెచ్చిపెట్టింది. అయిందేమిటో అయింది. ఇక యీ యేడు మళ్ళీ ఆవిధంగానే చెయ్యదుకద? ప్రతీ సంవత్సరం కొత్త కొత్త విషయానికి క్లబ్బువాళ్ళు ప్రైజులిస్తారు కాని ప్రతీయేడూ భర్తలను భార్యలను ఫూల్సుగా చేసినందుకే ప్రైజు లిస్తారనడం అసంభవంగదా! కాబట్టి ఆదురుద్దేశం నాభార్యకు లేకపోవచ్చును. మరి వేరే విషయం యేదైనా ఉంటుందా?

లేడీస్ కల్చరు క్లబ్బువారు ప్రతీ యేడూ డిశంబరులో బహుమతు లిస్తారు. డిశంబరు యింకా మూడునెల్లు ఉంది. నాభార్య నన్ను లాలించడం అప్పుడే మొదలు పెట్టింది.

నాకు బహుమతిగా వచ్చిన నటరాజ విగ్రహాన్ని తనూ పూజించడం మొదలు పెట్టింది. గోడలమీది సినీమా బొమ్మలు తీసివేసి దేవుళ్ళ బొమ్మలు తగిలించింది. రోజూ నాచొక్కాలకు బొత్తాలు పెట్టపెడతోంది. ఊడిపోయిన బొత్తాలు కుట్టి పెడతోంది. పంచెలు మరమ్మతు చేస్తోంది. వద్దంటే వినక నాకిష్టపడప్పుడు వాసన నూనెలూ అత్తరువులూ రాస్తోంది. ఒకమాటు బలవంతాన్ని నామొహంలంతా ఫేసు పౌడర్ పామింది వద్దంటూంటే! సబ్బుతో కడుక్కొని ఆఫీసుకు ఆలస్యంగా వెళ్ళి చివాట్లు కూడా తినవలసి వచ్చిందప్పుడు.

ఒకవేళ నాభార్యకు మమకారం హెచ్చిందేమో నామీద— ఒకవేళ బుద్ధి తిరిగిందేమో. చదువుకొన్నది; హిందూదేశంలో పుట్టినది; విద్యాదోషంవల్ల కొంతవరకు బుద్ధి కొంతకాలం పరదేశపు దారిని పట్టినా క్రమేణా సర్దుకొంటూన్నదేమో?

ఏమైనా యీయేడు బహుజాగ్రత్తగా ఉండాలని దృఢ సంకల్పం చేసుకొన్నాను. నాభార్య ఎంతమమకారం చూపినా, ఎంత చాకచక్యంతో నడుచుకొన్నా, ఎంత పూర్వాచారాభిమానం నటించినా నేను చలించదలుచుకోలేదు. రాతిబొమ్మను చక్కిలిగింతలు పెట్టగలుగుతుందేమో చూద్దాము!

మిసెస్ వి. కే. వటీరావు, యమ్మే

ఈమార్పు తనలో ఎందుకు కలగాలో నా భార్యనే అడిగితే బాగుంటుందేమో ననిపించింది, చదువుకొన్న లేడితో వ్యవహారంగదా! తీరా అడిగితే తనను ఇన్సల్టు చేశానని విసిరికొడుతుందేమో! అడక్కపోతే నన్ను వట్టి ఫూల్ని చేస్తుందేమో? ఏమైనాసరే ఎందుకైనా మంచిదని నిశ్చయించి నాభార్యతో ఈవిషయాన్ని గురించి పూర్తిగా చర్చించడానికి తీర్మానించుకొన్నాను. మాఉభయులకూ తీరుబడిగాఉన్న ఒక రోజున నాభార్యను పిలిచాను. "వటీ! నీవిలువయిన కాలంలో కొన్ని నిముషాలు నాకొరకు వినియోగించ గలవా?" అన్నాను యింగ్లీషుతో. నాభార్యపేరు అసలు కళావతమ్మ, అది క్రమక్రమంగా కళావతి, వతిగా మారింది. ప్రస్తుతం వాడుకలో ఉన్నపేరు "మిసెస్ వతీరావు" లేక "వటీరావు" ఈచివర "రావు" నాపేరు. ఇంగ్లీషులో మాత్రమే పేరు చదివేవారు నాభార్యను మిసెస్ వటీరావు అనిగాని, మిసెస్ వాటీరావు అనిగాని పిలుస్తారు. మొగుడిపేరు తమ పేళ్ళ చివర తగిలించుకోవడంలోనే ఇంగ్లీషు చదువుకొన్న ఆడాళ్ళ అస్వతంత్రత కనబడుతోందని ఒకమాటు నేను దెప్పిపొడిచాను. అది అస్వతంత్రత కాదనీ, పేరు ఒక ప్రత్యేకతకు సూచనగా మాత్రమే వినియోగిస్తుందనీ, మొగుడిపేరు ఒంటరిగా వదిలివేస్తే దిక్కుమాలినదై పోతుందని తమపేరుతో జోడిస్తున్నామనీ, అందుకు

కృతజ్ఞత చూపక దెప్పిపొడవడం నగవాళ్ళ నీచత్వానికి నిదర్శనమనీ చెప్పి మళ్ళీ నన్ను కిక్కురు మనకుండా చేసింది.

"అయితే కళ్లా, యీరోజేను మీక్లబ్బులో బహుమతులివ్వడం కద్దా?" అని అడిగాను "మళ్ళీ మీకు బహుమానం పొందాలని ఉందా ఏమిటి పాపం—మా అమ్మే, నాకంటె పాపే." "నాకు బహుమానం కావాలని కాదు, వటీ; నీకు బహుమానం వస్తే నాకు వచ్చినట్లు కాదూ?"

"ఆఁ" మరే, పాపం— నాబహుమానం మీరు కొట్టెయ్యాలనుకుంటున్నారు గాబోలు—"

"అది కాదు, వటీ!"

"పోనీ కావలిస్తే తీసుకోండి పాపం. మాటవరసకి నాకీ యేడు ఒక చీర, ఒక బ్లౌసూ బహుమానం యిచ్చారనుకుందాం. మీరంత సరదాపడుతూంటే మీకు కాదని నేనుమాత్రం వాటిని వాడతానా ఏమిటి? మీరే తీసుకోండి."

"ఛా, సిల్లీ; అందుకు కాదు నేను అడుగుతూంట. అసలు సంగతి తెలుసుకోడానికి."

"సంవత్సరోత్సవాలు ఉన్నప్పుడు బహుమతులే ఉండవూ ఆమాత్రం నాడార్లింగుకు తెలిసిందికాదుకాని."

"అయితే కిందటి యేడులాగ ఈయేడేమైనా కోతిపనులు చేస్తావా?"

అనగానే నామీసం పట్టుకు లాగుతూ "అంత మరపేమిటి మీకు, డియర్ హబ్బీ? కోతపనలు మీరా, నేనా చేస్తే? మీ తెలివి తేటల వల్లనేగా నాకూ మీకూ బహుమానం వచ్చింది!"

మీసం వదిలించుకొని అన్నాను గదా "చూడు కళా, ఈ యేడుగానీ నన్ను అలాంటి కోతిపనుల్లో కలుపుకున్నావంటే మాట దక్కదుసుమా."

"నోఫియర్ మైడియర్."

"అయితే, వటీ, అసలు సంగతేమిటి? ఈ యేడు ఎందుకని బహుమతు లిస్తారు?" అన్నాను సంగతి తేల్చుకోడానికి.

నాభార్య అనుమానించి, నాకేసి పరకాయించి చూచింది. నాముఖమూ, చెవులూ, జుట్టూ తన చేతులతో దువ్వుతూ అన్నది.

"అనుమానం పట్టుకుంది కాబోలు కాదూ మీకు?"

"కాదు, డార్లింగ్;"

"అవును, పీచ్!'

"కాదంటూంటే!"

"అయితే చెప్పడానికి వీల్లేదు!"

"ఏమిటే?"

"బహుమతు లెందుకిస్తారో చెప్పడానికి వీల్లేదు—క్లబ్బు రూల్సు పాటించ నక్కరలేదంటారా ఏమిటి?"

'చెప్పకూడదని క్లబ్బు రూల్సా?"

"అవును మై పెట్!"

"డియ్యర్ హబ్బీకికూడా చెప్పకూడదా, రోజ్?"

"సారీ, హబ్బీ."

"పోనీ ఆగోడవ నాకక్కరలేదు గాని— నామీదకు మాత్రం రాకేం, ఓల్డుగరల్!"

"మీచేత వేషం వేయించను లెండి."

"సరే, నాజాగ్రత్తలో నేనుంటానులే!"

"ఆల్ రైట్, మై డియర్!"

"కళా, ఇంకోప్రశ్న అడగాలని ఉంది; అడగనా?"

రైటో; అడగండి."

"ఈమధ్య నీకు నామీదా, నా అభిప్రాయాలమీదా కొత్తగా అభిమానం కలిగింది. ఎంచాత నంటావు?" ఈప్రశ్న నేనడగడంతోనే నాభార్య కోపం నటించింది. తటాలున లేచి వెళ్ళిపోబోయింది. గుమ్మందాకా వెళ్ళి మళ్ళీ తిరిగివచ్చి, గభాలున నావళ్ళో కూచుని నాబుగ్గలు రెండూ గట్టిగా సాగదీసింది. నామీసాలు గుంజింది. గట్టిగా కంఠాన్ని ఆశ్లేషించి "ఇంకెప్పుడూ అడగరుగదా అలాంటి ప్రశ్న, అడగరుగదా, అడగరుగదా!" అంటూ నాచెంపలు మృదువుగా ప్రేమతో వాయించింది.

'నాప్రశ్నలో తప్పేమిటి?" అన్నాను.

"తప్పేమిటా, తప్పేమిటా" అని నన్ను బుజాలు పట్టి ఊగిస్తూ

"నన్ను అనుమానిస్తారా యింత డర్టీగా? నా ప్రియమైన భర్తమీద నాకెప్పుడు అభిమానం లేదు? నాకనుపాప అభిప్రాయాలమీద నాకెప్పుడు అభిమానం లేదు? క్రొత్తగా అభిమానం పుట్టించంటారా? మీన్!" అని మొహం చిట్లించింది. నాఅభిప్రాయానికి ఆధారాలు లేకపోలేదు. కాని అవి అన్నీ నేను చెప్పితే నా భార్య చిన్న బుచ్చుకోవచ్చు, లేదా కోపగించుకోవచ్చు ననుకొని, తనకు మాత్రం ఆలోచిస్తే తెలియదా ఏమిటి అనుకొని ఊరుకొన్నాను.

పర్యవసానం ఏమీ తేల్లేదు. ఎందుకు బహుమతు లిస్తారో రహస్యంగా ఉంచుకొన్నారు. నా చేత వేషం వేయించవ లని మాత్రం నాభార్య చెప్పింది. వెయ్యమంటే మాత్రం వేస్తానా. కాబట్టి అది చెప్పి లాభంలేదు. ఏవిధంగానైనా నన్ను మోసగిస్తుందేమో అన నా జాగ్రత్తలో నే నున్నాను. నాభార్యను కనిపెడుతున్నాను. ఒకనాడు నే నింట్లో ఉండగా నాభార్య ఒక పెద్దమనిషిని తీసుకొని వచ్చింది. అతగాడు యింగ్లీషు దుస్తులు వేసుకొన్నాడు. చేతులో ఈవినింగ్ హాట్ ఉంది. మీసం ముక్కుకింద మాత్రమే ఉంది. పడుచువాడు.

సాధారణంగా ఎవళ్ళనైనా క్రొత్తవాళ్ళను యింటికి తీసుకు వచ్చినప్పుడు నాభార్య నాకు వాళ్ళని ఎరుకచేసేది, ఇట్ర

డ్యూసు చెయ్యకుండా ఎప్పుడూ ఉండలేదు. ఇప్పుడుమాత్రం ఆనల్లదొర ఎవరో నాతో చెప్పలేదు. నేను ఫలానా అని అతడితోనూ చెప్పలేదు.

వచ్చీరావడంతోనే ఇద్దరూ రెండు కుర్చీలలో కూలబడ్డారు. నాభార్య తనచేతి సంచీ బల్లమీద పెట్టింది. దానిమీద అతడు తనహాట్ పడవేశాడు. కాఫీ ముందర పెట్టుకొని బిస్కత్తులు తింటూ వాళ్ళు ఇంగ్లీషున అదే కబుర్లు చెప్పుకోవడం మొదలు పెట్టారు.

పక్క గదిలోకి వెళ్ళి నేను పని చూచుకొంటున్నాను. ఉండుండీ ఇద్దరూ విరగబడి నవ్వుతున్నారు. చప్పట్లు కొడుతున్నారు. బల్ల గుద్దుతున్నారు. చేతులతో తొడలు కొట్టుకొంటున్నారు. ఎందుకో అంతకులాసా నాకు బోధపడిందికాదు.

ఆ మొద్దు ముండాకొడు కెవరో నాకాఫీ అంతా తాగేస్తూ, నాబిస్కత్తులన్నీ మింగేస్తూ, నాకుర్చీలూ బల్లలూ విరగ్గొడుతూ, నా భార్యతో ఆంటెజోస్తీగా మాట్లాడుతూ, నవ్వుతూ, నాయింట్లో యింత హంగామా చేస్తూన్నందుకు నాకు కోపం వచ్చింది. కాని ఏమిచేసేది. ఏమైనా కలగచేసుకొంటినా చదువుకొన్న భార్యతో వ్యవహారం పెద్దపులితో చెలగాటంవంటిది.

కాని ఒకటుంది. నాభార్య అనేక పట్టణాల్లో కాలేజీలల్లో చదువుకొన్నది. కాబట్టి అనేకమంది స్నేహితులు ఆవిడ

కున్నారు. ఆడవాళ్ళల్లోనూ ఉన్నారు. మగవాళ్ళల్లోనూ ఉన్నారు. బహుశా యీ మనిషి మగమిత్రులలో ఒకడు కావచ్చు. పాత స్నేహితుడు కావచ్చు. చాలా కాలానికి వాళ్లు కలుసుకొని ఉండవచ్చు. అందువల్ల ఈ ఉత్సాహమంతా అయి ఉండవచ్చు. లేదా అతడు నా భార్య దూరబంధువు కావచ్చు. నా భార్య దూరబంధువులనందరినీ నేను ఎరిగి ఉండను గదా! ఒకమాటు చూచిపోదామని వచ్చి ఉండవచ్చు. దూరబంధువే అయితే నేనుకూడా కొంతమట్టుకు బంధువునేగదా! మరి నన్ను కలసుకోలేదేమి?

లేదా ఒక వేళ వాళ్ళ క్లబ్ మెంబర్లతాలూకు మనిషై ఉండవచ్చు. ఏ మెంబరు భర్తో, అన్నో, తమ్ముడో అయి ఉండవచ్చు. ఆ మెంబరుద్వారా నా భార్యతో పరిచయం కలిగించుకొని ఉండవచ్చు. ఎందుకు తొందరపడడం? తెలుస్తుందిగదా.

కొంతసేపటికి సద్దణిగింది. నా గదికేసి వస్తారేమో, నాకు అతనితో పరిచయం కలిగిస్తుందేమో అని ఆశతో సులోచనాలు సర్దుకొని సీరియస్‌గా బింకంగా కూర్చున్నాను——
ఎవరూ వస్తూన్న జాడ లేదు. నిరుత్సాహంతో లేచి చూస్తును గదా—నా భార్యా ఆముష్క కింద మీసాలవాడూ కలిసి కబుర్లు చెప్పుకొంటూ నవ్వుకొంటూ వీథమ్మట నడిచివెడుతున్నారు!

రెండుమూడు రోజులదాకా నా భార్యతో నేను సంప్రతించడానికి వీలుకలిగింది కాదు. నా పనుల తొందర, ఆవిడకి క్లబ్బు

తొందర, స్నేహితులతో పరిచయాల తొందర—ఇన్ని కారణాలు—

ఈ రెండుమూడు రోజులలోనూ ఎన్నో విశేషాలుకూడాను. ఒకనాడు నేను కచేరీపని పూర్తిచేసుకొని షికారుగా సముద్రతీరానికి వెళ్ళాను. హాయిగా గాలివీస్తోంది. సముద్రపు అలలు నాపాదాలదగ్గిరికి వచ్చిఆడుకొంటున్నాయి. సముద్రంనాహృదయంలాగే లేచి పడుతోంది. సూర్యుడు సముద్రంలో అస్తమించబోతున్నాడు. కడుపులోచెయ్యిపెట్టికడిగివేస్తూన్న బెంగలుమరచిపోయి, సంధ్యావందనం సంగతికూడా మరచిపోయి ఆ నీలిసముద్రంకేసీ, ఆఎర్ర సూర్యబింబంకేసీ చూస్తూ సంజవెలుగులో మునిగిఉన్నాను.

కొంతసేపైనతర్వాత తల పక్కకితిప్పి చూచాను. ఒకపురుషుడూ ఒక స్త్రీ మాట్లాడుకొంటూ వస్తున్నారు. కొంతసేపటికి పోలిక గట్టగలిగాను. ఆపురుషుడు ముక్కుకింది మీసంవాడు; ఆ స్త్రీ నాభార్య! అలలుమరిచాను, సముద్రం మరిచాను, సంజ మరచాను, అంధకారంలో పడ్డాను. దగ్గిరికి వస్తారుగదా ఏవిధంగా ఈకుట్ర పరిణమిస్తుందో చూతామని వాళ్ళనుచూడనట్టునటిస్తూ అక్కడేనిలబడ్డాను.

నాభార్య నన్నుచూచిందికాబోలు దారిమళ్ళించి అడ్డదారిని ఆతణ్ణి తీసుకువెడుతోంది. ఆ మసకచీకట్లో వాళ్ళనవ్వులు వినిపి

స్తున్నాయి. కనిపెట్టిచూస్తున్నాను. వాళ్లు మోటారుకారుదగ్గిరికివెళ్లారు. కారుఎక్కారు. కారు బయలుదేరుతోంది లేదు. బయలుదేరడంలేదు. ఎందుచేతనో, పదినిముషాలైంది. నేను చూడనేలేను సముద్రపు ఒడ్డునుంచే వెళ్లింది ఒకపడుచమ్మాయి. కారు సమీపించింది; ఆమె కారు ఎక్కింది. కారు కదిలి వెళ్లిపోయింది.

ఎవరో ఆ అమ్మాయి? ఎంతక్షోభపడింది మనస్సు నిష్కారణంగా అనుకొంటూ ఇంటిమార్గం పట్టాను.

ఇంకోమాటు కచేరీపని కావడంతోనే కల్చరు క్లబ్బు పక్కనుంచివెడదామని బుద్ధిపుట్టింది. నాభార్య కనిపిస్తుందేమో ఏమి చేస్తూఉంటుందో గేటుఇవతలనుంచే చూడవచ్చుననుకొన్నాను. మనస్సు మహాపాడువస్తువ. ఎంతసమాధానపెట్టినా వినదు. ఇంటికి పోనియ్యకుండా ఎందుకు ఈక్లబ్బువైపుకు ఈడ్చుకురావాలి? ఏదైనా ఫలానా కార్యంకోసమని తీసుకువస్తే బాగుంటుంది. ఏమీలేదే! ఈమనస్సు అడుగుపొరల్లో ఏదో అనుమానం దాన్ని శల్యంలాగ బాధిస్తోంది. ఆ అనుమానాన్ని దృఢపరుచుకోడానికో, రద్దుచేసుకోడానికో ఈ ప్రయత్నమంతాను. ఎవరిమీద అనుమానం? నాభార్యమీదనే? నాభార్య గడుసుదంటే ఒప్పుకొంటాను; పెంకెదంటే ఒప్పుకొంటాను, మాటకారి అంటే ఒప్పుకొంటాను చెయ్యిచేసుకొనే స్వభావంకలదంటే

ఒప్పుకొంటాను — కాని యిన్నాళ్లు నిష్కళంకంగా నాతో కాపురంచేసి, మాయిద్దరికీ సంతానంకూడా కలిగినతరువాత యింకా అనుమానమా? మనస్సు మహ చెడ్డవస్తువ! క్లబ్బుపక్క నుంచి అటూ ఇటూ తిరిగాను. గేటులోనుంచి చూచాను నాభార్య కనబడలేదు. ఇంతలో గేటుదగ్గిరజవాను నన్నుచూచి వచ్చి నమస్కరించి అన్నాడు బాబయ్యా, "యీ యేల అమ్మ గోరు కబ్బుకు రానేదు. ఆరెవరో, పెద్దింటోరే బాబయ్యా, ఆలుమగళ్లు దెబ్బలాడుకొన్నారంట-సంసారంగాదా బాబయ్యా; అమ్మగోరు ఆమొగాయన్ని యెంటబెట్టుకు ఎల్లిపోయేరంట." మాయామర్మం ఎరగని వాడిమాటలు విని నామనస్సు చివుక్కుమంది. వెంటబెట్టుకు వెళ్లడమంటేఏమిటి? చెప్పరానిమాటైతే వాడు నాతో చెప్తాడా? చెప్పగూడినమాటైతే వెంటబెట్టుకు వెళ్లడమంటేఎమిటి? వెధవ అనుమానం బాధిస్తూనే ఉంది. ఎందుకు అనుమానం?

ఇంటికి వచ్చివాణ్ణి నాకు చూపక పోవడం ఒకటి; లీలదగ్గిర తప్పించుకు పోవడం రెండు; మొగాయన్ని వెంట బెట్టుకువెళ్లడం మూడు. సరే, కానీ అడిగి చూస్తాను!

నాభార్య సీసంగతు లన్నీ నిలవేసి అడగాలని నిశ్చయించాను. సంజాయిషీ ఏమియిస్తుందో చూడ్డాలని నిశ్చయించాను. కాని ఆవిడ ఎడమొహం పెడమొహంగా తిరుగుతోంది. నాతో సమావేశం కాకుండా ఉండాలని ప్రయత్నిస్తోంది. నేను

ఎప్పుడైనా పిలిచినా, ఏమైనా అడిగినా "ఇప్పుడుగాదు, తీరు బడిలేదు; సారీ" అంటోంది. నా భార్య ప్రవర్తనలో, కళ్ళల్లో, చేష్టల్లో మార్పు కనిపిస్తోంది. చూడమని నా మనస్సు నాకు బోధిస్తోంది. ఇలా ఉండగా నాకో ఉత్తరం వచ్చింది. నా శ్రేయోభిలాషి వ్రాసింది. పేరులేదు ఊరులేదు. అందులో విషయాలు ఏమిటంటే—"మీరు బహుఉత్తములు. విద్యావతిని వివాహమాడి ధన్యులైనారు. ఇంతవరకూ కళంకం లేకుండా మీ సంసారం జరిగింది. మీ మేలు కోరినవాడను కాబట్టి చెప్పుచున్నాను. మీ భార్య ప్రవర్తన అనుమానాస్పదంగా ఉన్నది. నిరంతరమూ చాటుమాటూ లేకుండా ఒక జెంటిల్‌మానుతో తిరగడం మా బోటివారికి చాలా విచారంగావుంది. మీరు తగు శ్రద్ధ వహించాలి. సంసారులము గదా! వ్యవహారము ఘోక్తుపరుచుకోవాలిగాని పాడుచేసుకోకూడదు. సెలవు"

ఇంకేముంది. అనుకున్నంతా జరిగింది. ఏమిటి చెయ్యటమిప్పుడు? వ్యవహారం ఘోక్తుపరచుకోవాలిట! అలాగే వుంటుంది పరాయివాళ్ళకి. తనదాకా వచ్చేదాకా తెలియదు.

మతిపోతోంది. ఉత్తరం మళ్ళీ చదివాను. ఆదస్తూరీ ఏదో ఎరిగిఉన్నట్లే ఉంది. ఎవరో నా మిత్రులో బంధువులో వ్రాసి ఉంటారు. ఉత్తరం జాగ్రత్త చేశాను. కర్తవ్యమేమిటో మాత్రం తెలియడంలేదు. డైవోర్సుబిల్లేనా పెట్టారుగారు.

కార్పణ్యంతో తిరుగుతున్నాను. నాభార్య ముఖంకేసైనా చూడ్డంలేదు. మా యిద్దరికీ కొన్నాళ్ళు మాటలుకూడా లేకపోయాయి. ఏమిచెయ్యాలో నిర్ణయించి తరవాత దండిద్దామని ఆలోచిస్తున్నాను. డిశంబరునెల గడిచిపోతోంది.

ఒకనాడు నాభార్య గంతులతో, నవ్వులతో ఒకపెద్ద తోలు ట్రంకు పట్టుకొని నాదగ్గరకొచ్చింది. నేనామెముఖం చూడలేదు.

"ఏంచేస్తున్నారు, మైడియర్" అంది. నాకు వళ్ళుమండుతోంది. అసహ్యంగా నాభార్య మొహంకేసి చూచాను. ఇంతాచేసి సిగ్గూ బిడియం లేకుండా యీవిధంగా నాదగ్గర కొస్తుందా! కాసీ.

"కోపంవచ్చిందా. మైలవ్" అన్నది. నాకు అసహ్యం, కోపం ఎక్కువౌతున్నాయి. తొందరపడి ఏంచేసిపోతానో అని నాలోనాకే భయంగావుంది.

"మైడియర్ నన్ను క్షమించవూ!"

"నీప్రవర్తన ఏమీ బాగాలేదు. పిల్లలగన్నదానవు—బుద్ధి లేదూ? సిగ్గూ బిడియం లేదూ? ఏమొహంపెట్టుకు నాదగ్గిర కొచ్చావు—అవతలికి ఫో" అన్నాను.

ఈమాటలు వినడంతోనే మానమున్న భార్యఅయితే బయటికి వెళ్ళిపోయి గదిలోకూర్చుని ఏడుస్తుంది. నాభార్య

అప్పుడప్పుడు నేను తిట్టినప్పుడు—ఆవిధంగానే చేసేది. ఇప్పు డుకూడా ఆలాగే చేస్తుందనుకొన్నాను. చెయ్యలేదు సరిగదా విరగబడి నవ్వడం మొదలుపెట్టింది. చప్పట్లుకొట్టి గిర్రున తిరుగుతూ నవ్వుతోంది. ఈప్రవర్తన నాకర్థంకాలేదు. నవ్వినవ్వి నా ఒళ్లోకి వచ్చికూచుని **నాచేతులు** గట్టిగా పట్టుకొంది. చేతులు వదిలించుకొని కిందకు తోసెయ్యాలనుకొన్నాను. నిదానించాను. అప్పుడంది నాభార్య "మీమనస్సుకు చాలా నొప్పికలిగించాను, నాకుతెలుసును; రెండునెలలపాటు మిమ్మ ల్ని బాధపెట్టాను; నేనెరుగుదును. నేనుమాత్రం బాధపడడం లేదాఏమిటి? పైకి నవ్వుతున్నానుగాని మనస్సులో ఎంతఏడు స్తున్నాను నన్ను క్షమించరూ? నన్ను క్షమించరూ?" అంటూ నాచేతులు వదిలిపెట్టి కళ్ళమీద చేతులుపెట్టుకొని ఏడవడం మొదలెట్టింది. నాకు జాలివేసింది. కాని మనస్సు కఠినంగానే ఉండమంటోంది. అన్నా నాభార్య చీరకొంగుతో దానికన్నీ ళ్లుతుడిచివేసి, కళ్ళముందరనుంచి చేతులుతీసి "ఏమిటిదంతా" అన్నాను.

"నన్ను క్షమించండి. చెయ్యక తప్పిందికాదు" అన్నది.

"సరే నేనడిగినప్రశ్నకు సమాధానంచెప్పు" అనిపించింది నామనస్సు

నాభార్య మాట్లాడలేదు.

"ఏవరా రెణ్ణెల్ల క్రితం మనింటికి వచ్చిన పెద్దమనిషి? "వాడిని నాకెందుకు యింట్రడ్యూసు చేశావు కావు?" వాడితో నవ్వులు నవ్వుకొంటూ పోక నాదగ్గిర కెందుకొచ్చావు? వాడితో సముద్ర ప్రొద్దున షికార్లు కొట్టుకో నీయిష్టం వచ్చినట్లు! ఆలూమగళ్ళు దెబ్బలాడుకొంటే అదే సమయమని వగాణ్ణి వెంట వేసుకు వెళ్లు. నాదగ్గిర కెందుకు వచ్చావు?" అన్నాను కోపధోరణితో.

"వినండి, వినండి, అంతా చెబతాను. తొందరపడకండి." అన్నది నాభార్య నాపళ్ళోనుంచి లేవనెత్తి పక్క కుర్చీలో కూచోబెట్టి చెప్పమన్నాను. నాభార్య యీ విధంగా చెప్పింది.

"మా క్లబ్బులో ఒకమ్మాయి ఉంది. ఆవిడకు పెళ్ళయి ఇంకా సంవత్సరమేనా దాటలేదు. పట్టి తెలివితక్కువ పిల్ల. ఆ మొగుడేనా సర్దుకుపోయేవాడేమో నసుకొంటే అతడు కోపదారి. అందువల్ల వాళ్ళిద్దరికీ అన్యోన్యం చెడింది. ఇద్దరూ విడిపోయి ఒక నెల్లాళ్ళు కాలక్షేపం చేశారు. ఎన్నాళ్ళు అలాగ ఉండగలరు? తానని చెప్పి ఆపిల్ల మొగుణ్ణి రమ్మనదు. అంత అభిమానం ఆవిడికి. అతగాడు మగాడుగదా సర్దుకోగూడదా అంటే అతనికీ తగని గర్వం. కాబట్టి మధ్యవర్తుల ద్వారా వాళ్ళ వ్యవహారం ఫాక్తు పరచవలసి వచ్చింది.

మా క్లబ్బులో ఒక నియమ మేమిటంటే—మాలో ఎవరికి ఏ ఆపద వచ్చినా క్లబ్బు మెంబర్లు కలగజేసుకొని సహాయించే

స్తాను. ఈవిషయమై ఒకసభచేసి ఏకగ్రీవంగా నన్ను మధ్య వర్తిత్వం నడిపించమన్నారు. క్లబ్బుతీర్మానానికి అనుగుణంగా నేనతన్ని పిలిపించి వెళ్లాళ్ళు అతనితోపాటి భార్యతో సమాధానపడడానికి వప్పించాను.

ఆపిల్లదగ్గిరికివెళ్ళి చెప్పవలసినవిధంగా చెప్పి సమాధానపరిచాను. వాళ్ళిద్దరూ కలుసుకొని రెండురోజులే అయింది.

"అయితే అతన్ని ఇంటికి తీసుకువచ్చి ఆ విరగబడి నవ్వులెందుకు? నా మొహంఎదటే అంత అల్లరెందుకు? బీచి షికార్లెందుకూ?"

"బీచిషికారు అతనూ, నేనూ, అతనిభార్యా వెళ్ళాము. అప్పటికింకా వాళ్ళు సుముఖులు కాలేదు. వాళ్ళిద్దరినీ చెరోవేపున పెట్టుకొని ఆమాట ఈమాట చెపుతూ నవ్విస్తూండే దాన్ని; క్రమక్రమంగా నన్ను వదిలి వాళ్ళిద్దరూ చెట్టాపట్టాలు వేసుకొని కబుర్లలోకి దిగీదాకాను."

"మరి?"

"అతనితో అలాగ విరగబడి మీ మొహంముందు నవ్వడానికి కారణం లేకపోలేదు." అన్నది నాభార్య.

దాచినఉత్తరం తీసుకువచ్చి నాభార్యమీద పడవేసి "ఇదేమిటో చూశావా" అన్నాను.

ఉత్తరం చేత్తో పుచ్చుకుచూచి నాభార్య మళ్ళీ నవ్వడం మొదలెట్టింది.

"ఎందుకావన్నావ్?" అన్నాను.

"ఎవరు వ్రాశారో ఆ ఉత్తరం చూంశారా?" అంది.

"ఎవరో శ్రేయోభిలాషిట!"

"ఆ దస్తూరీ ఎవరిదో?" అన్నది.

"ఏమో, నాకేం తెలుసు!" అన్నాను.

"మళ్ళీ ఇంకోమాటు నిదానించి చూడండి" అని నామీదకు ఉత్తరం విసిరింది.

జాగ్రత్తగా దస్తూరీపరీక్షించి, 'ఎవరిదంటావు?' అన్నాను.

"ఎవరిదా? ఇంకోమాటు చూడండి" అన్నది.

"ఎంత మోసం! నీదే ఈ దస్తూరీ! కళ్ళు కప్పావుపోయేయి నాకు"

"ఇప్పుడు తెలిసిందా?" అన్నది.

"ఏమిటి తెలియడం" అన్నాను.

"ఆ విరగబడి నవ్వడమూ, ఈ ఉత్తరమూ నామీద మీకు అనుమానం కలగడానికే!"

"ఎందుకు అనుమానం కలిగించుకొన్నావు?"

"ఈయేటి క్లబ్బుబహుమానం కోసం."

"బహుమానం యియ్యడానికి ఏమిచెయ్యాలన్నారేమిటి?"

"శీలానికి భంగంరాకుండా ఎవరైతే తమభర్తలకు తమ గుణాన్ని గురించి అనుమానం కలిగిస్తారో వారికి బహుమానం.

ఎసీవోళక్కార్తవేనా ఏమిటి, మీ క్లబ్బుకంతకీ అంత ప్రయోజకురాలివి. మై లిటిల్ సాండ్రెల్?"

"అందరికన్న మార్కులు నాకు ఎక్కువవచ్చినవి కాబట్టి నాకు బహుమానం వచ్చింది."

"ఎలాగ ఆమార్కులు నిర్ణయించారు?"

"జడ్జీలు గూఢంగా మెంబర్లతాలూకు భర్తలచర్యలు ఈ రెండునెలలబట్టీ కనిపెడుతున్నారు. మీ దిక్కుమొహం, మీరు క్లబ్బుచుట్టూ తిరగడం, నాతో మాట్లాడకపోడం — ఇవన్నీ చూచి నేనే నెగ్గానని నిర్ణయించారు."

"ఇలాంటిపనులు చెయ్యడం ప్రమాదంకాదూ? ఎటునుంచి ఎటువస్తుందో! సంసారాలు చెడిపోవూ."

"ఆ ధైర్యమున్నవాళ్ళే యిందులో ప్రవేశించారు. ఈమాత్రం యడ్వెంచర్ సాహసం ఆడవాళ్ళకు లేకపోతే ఎందుకు పనికివస్తారు?"

ఈ ప్రశ్నకింక సమాధానంలేదు. నామనస్సులో బెంగతీరింది. కుదుటబడ్డాను. నిట్టూర్పు విడిచాను.

౫

నాభార్య కాఫీ, బిస్కతులూ, చోకలేట్లూ తెచ్చి బల్లమీద పెట్టింది. ఇద్దరమూ ఆరగిస్తూ సరదాగా ప్రసంగించుకొన్నాము.

"నువ్వు మీవాళ్ళెవ్వరికంటెకీ ప్రయోజకురాలవులాగున్నావే! క్రిందటిఏటి బహుమానం నీదే; ఈయేటిదీ నీదే" అన్నాను.

"పియర్ లక్; మీసహాయం లేకపోతే నాకీ బహుమతులు వచ్చేవా చెప్పండి మరి."

"అల్లరిపిల్లా! అయితే నీతోకూడా ఈయేడు ఈ పందెంలో ప్రవేశించినవాళ్ళసంగతి చెప్పావు కావు" అన్నాను.

"చెప్పనా,—ఒకావిడ తానే తనకు ఎవరో పురుషుడు ప్రేమలేఖ వ్రాసినట్లు వ్రాసుకొని ఆకవరు తన చేతిసంచీలో పెట్టి భర్తతో మాట్లాడడానికి వెళ్ళింది. మాటలమధ్య కవరు కింద జారవిడిచి వెళ్ళిపోయింది. భర్త ఆకవరుతీసి చదువుకొన్నాడు. కొంతసేపైనతరువాత భర్తదగ్గిరికివచ్చి బిక్కమొహంతో నా ఉత్తరం పడిపోయిందంది. ఆ ఉత్తరం తనకు దొరికిందనీ తాను చదివేసనీ భర్త చెప్పాడు. ఆవిడ భయం నటించి గడగడ వణికింది. భర్త ఆవిడతో అన్నాట్ట, "ఇదివరలో ఎన్ని ఉత్తరాలు వచ్చాయి నీకు?"

భయపడుతూ, "ఇదే మొదటిది క్షమించండి" అందిట్ట.

"దీనికి సమాధానం రాశావా" అని అడిగేట్ట.

సందేహిస్తూ మెల్లిగా 'రాశా' నందిట.

"రాశావా! ఎలారాశావు మై డియర్ వైఫీ? దీనిలో అడ్రెసులేదే!"

ఆవిడ తెల్లబోయిందట.

"మళ్ళీ మీా క్లబ్బువాళ్ళు మీాచేత కోతిచేష్టలు చేయిస్తున్నారా ఏమిటి?" అన్నట్టు నవ్వుతూ. భర్తకు అనుమానం కలిగించ లేకపోబట్టి ఆవిడకు ఒహ్యామానం లేదు.

ఇంకో ఆవిడుంది మా క్లబ్బులో. ఆవిడకు సిగరెట్టు అలవాటులేదు. ఆసంగతి భర్తకు తెలుసును. ఆనెం భర్తకూ సిగరెట్టు అలవాటులేదు. ఒకనాడావిడ భర్త వచ్చేవేళకు రెండు ప్యాకెట్ల సిగరెట్లు కుంపటిలోవేసి ఆపొగ ఇల్లంతా చుట్టివేసుకొనేలా చేసింది. ఇంతట్లోకే భర్త వచ్చి తలుపుతట్టాడు. పది నిముషాలదాకా తలుపు తియ్యలేదు. ఈపాటికి అనుమానం కలిగిఉంటుందిగదా అనుకొని తలుపుతీసి చీరా, పైటా సవరించుకోవడం మొదలెట్టింది. భర్త లోపలికి వచ్చాడు. సిగరెట్టు వాసన పీల్చాడు. భార్యతో అన్నాడుగదా, "చెప్పవుకావు; క్లబ్బులో మెంబర్లంతా సిగరెట్లు కాల్చాలని నిబంధన వచ్చిందాఏమిటి? అంతసిగ్గూ, దాపరికం ఎందుకు? చంపేశావే వీధులోనిలబెట్టి! ఈమాత్రం కార్యానికి భయమెందుకు? నీయిష్టమొచ్చినన్ని సిగరెట్లు కాల్చుకో నేనేమీ అనను. రేపు మంచి 'నేవీకట్' సిగరెట్లు ఒకడబ్బా తెస్తానుండు." భర్తకు అనుమానం రాలేదు సరిగదా సిగరెట్లఅలవాటు అంటుకొంటుందని ఆవిడ భర్తతో నిజంచెప్పింది. "నిన్నెప్పుడేనా అనుమానిస్తానా, అసే?" అన్నాడాభర్త.

"వింటున్నారా" అంది నాభార్య.

"వింటున్నా" అన్నాను.

"అనుమానించేవాడు గొప్పవాడా అనుమానించనివాడా?"

"నన్నేం చంపుతావు కానిద్దూ."

"ఆల్ రైట్, డియర్.—"

ఇంకోఆవిడ భర్త వీథిలో మొహం కడుక్కుంటూవుంటే తానూ ఆసమయానికి వీథిలోకి వచ్చి ఎదురింటియింటి పెద్దమని షిని నిదానించి చూడ్డం మొదలుపెట్టింది. పదిహేనురోజు లీలాగ అయ్యేసరికి ఆ పెద్దమనిషి ప్రతీరోజూ వీళ్ళింటికి కాఫీకి తయారయ్యేవాడు. భర్తయెదుటే అతన్నెంతో ఆదరించి కాఫీ ఇచ్చేది, ఫలహారాలు పెట్టేది. అతడు యింటికివస్తే తాను ఎదురుగావెళ్ళి కుశలప్రశ్న లడిగేది. వెళ్ళిపోతూంటే షేక్ హాండు చేసేది. భర్తకీ ప్రవర్తనవల్ల ఆవిడమీద ఎటువంటి అనుమానమూ కలగలేదు. క్లబ్బు ఆచారాలు కొత్తగా నేర్చింది కాబోలనుకొన్నాడు. కాని ఒకప్రమాదం వచ్చింది. అప్పటినుంచీ ఆ పెద్దమనిషి వదల్చుకోవాలన్నా వదలకుండా పట్టుకొన్నాడు. చివరికి వాడిని వదలించుకోవటం బ్రహ్మాండం అయింది."

"ఎలాగ వదిలించుకొన్నారు?" అన్నాను.

"ఎలాగా? వాణ్ణి ఒక కూలివాడికింద కట్టి. ఆవిడ ఏపనిచెప్పితే ఆపనులు చేసేవాడు. రోజూ పోష్టులో ఉత్తరాలు వెయ్య

డం వాడే, బజారునుంచి కూరలు తేవడం వాడే, తోటలో చెట్లకు గొప్పులు త్రవ్వడం నీళ్ళు పొయ్యడం వాడే, పిల్లల్ని ఎత్తు కొని ఆడించడం వాడే. ఇలాగ పది పదిహేను రోజులు గడిపి విసిగి లేచిపోయాడు. అప్పుడు ఆవిడభర్త ఆవిడతో అన్నాడు గదా, "లేచిపోయాడేం ఆ పెద్దమనిషి? జీతం ఇత్తేం లేని కూలివాణ్ణి సంపాదించావుగదా అని సంతోషిస్తూంటే."

ఆవిడకు బహుమానం వచ్చేవిధం లేదుగదా ఇంక మీరు నన్ను అనుమానించారు. అనుమానిస్తే అనుమానించారు లెండి. ఇప్పుడు బహుమానం వచ్చిందికాబట్టి బెంగలేదు. కాని యిక ముందెప్పుడూ నన్ననుమానించరుగదా అని మీాసం పట్టుకో బోతూంటే అన్నానుగదా—"అయితే, హాసి; నీబహుమానం ఏమిటో చూపావుకాదేమి?"

"ఇందాకటినుంచీ మీకోసం ఎదురుచూస్తోంది—అదిగో ఆ ట్రంకు."

"ఏమిటే? ఆట్రంకా; దాన్లో ఏమైనా ఉందా? వుత్తిట్రం కేనా?"

"తీసి చూడండి."

ట్రంకుతాళం తీసి మూత ఎత్తి చూశాను. అందులో ఒక పట్టుచీరా, ఒకడజను గ్లాసులూ, ఒకడజను పెసరీలూ ఉన్నాయి.

"ఇవి ఆడవాళ్ళసరుకు ముట్టుకోకూడదు కాబోలు" అన్నాను.

"కూడకపోతే మానంతారా? మీరు ముట్టుకోకుండానే జరుగుతుందా?" అంది.

"అయినా నాకెందుకు? నీ బహుమానాలసంగతి" అన్నాను.

"మీకు మాత్రం గాకేమిటి? మనం పంచుకొందాం పాటిని" అంది.

"ఎవరు పంపకం వెయ్యాడం" అన్నాను.

"నేవేతునా" అని చీరా, బ్లౌసులూ నావళ్ళో పెట్టి పారిపోబోయింది. పట్టుకొని చెవులో చెప్పానుగదా.

"అవిమాత్రం మిగుల్చుకొంటావెందుకు—ఆ పిసరీలు—అవీ నాకేయియ్యి"

నాభార్య నవ్వుతూ నన్ను తలపమీద వాయించి చీరా బ్లౌసులూ తీసుకుపోయి బీరువాలో పెట్టుకొంది.

"ఈ ట్రంకుకూడా తీసికెళ్ళు" అన్నాను.

మై డియర్ హాబ్బీ! ఆట్రంకు మీది."

"థాంక్సు మై లిటిల్ మానీ."